క్లుప్తంగా

మూడు గ్రామాలకు ఒకే కార్యదర్శి

విజయవాడరూరల్: మండలంలో మూడు గ్రామ పంచాయతీలకు ఒకే ఒక్క కార్యదర్శిని ప్రభుత్వం నియమించింది. అంబాపురం గ్రామ పంచాయతీ రెగ్యులర్ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న డి.శ్రీనివాసరావును నున్న గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వం నియమించి, అదనపు బాధ్యతలను అప్పగించింది. ప్రస్తుతం పాతపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.కోటిలింగమ్మ సెలవు పెట్టడంతో ఆమె స్థానంలో కూడా డి.శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలను అప్పగించి ఇన్‌చార్జి కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. దీంతో మూడు గ్రామ పంచాయతీలకు ఒకే ఒక్క కార్యదర్శిగా శ్రీనివాసరావు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

రైల్వేతో వికాస్ కళాశాల ఒప్పందం



నున్న(విజయవాడరూరల్): వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వారు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్, దక్షిణ మధ్య రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఒప్పందంతో విద్య, పరిశోధన, అభివృద్ధి పథకాలను పరస్పరం సహకారానికి ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. ఇంటర్న్‌షిప్, పారిశ్రామిక సందర్శనలు, ప్రాజెక్టులు ట్రెనింగ్ ఇచ్చే అంశాలపై దక్షిణ మధ్య రైల్వే అవగాహన ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. గురువారం ఈ మేరకు ఒప్పంద పత్రాలపై కళాశాల ప్రిన్సిపాల్, దక్షిణ మధ్య రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కార్యదర్శి సంతకాలు చేశారు. ఇటువంటి ఒప్పందాల వల్ల విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగాలు సంపాదించుకునేందుకు ఉపయోగపడుతుందని కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

వాటర్ పైప్‌లైన్‌కు మరమ్మతులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని ప్రధాన తాగునీటి పైప్‌లైన్‌కు గురువారం మరమ్మతులు నిర్వహించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ఆదేశాలతో సిబ్బంది మరమ్మతు పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో తాగునీటి సమస్యలు గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామంలో 2 వాటర్ ట్యాంక్‌లు, డైరెక్టు పంపింగ్ 6, 15 మోటారు బోర్ల సహాయంతో తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరాలో కాల్వగట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

కార్మికుల సమ్మె నోటీసు



పెనమలూరు: మండల పరిధిలో ఆరు గ్రామ పంచాయతీల్లో కార్మికులు గురువారం ఆయా పంచాయతీల కార్యదర్శులకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ మేరకు సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి వివరాలు తెలుపుతూ దేశవ్యాప్త సమ్మె ఈ నెల 20వ తేదీన కార్మికులు నిర్వహించనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న కార్మికులు కూడా దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా పాల్గొంటారన్నారు. కార్మికుల డిమాండ్‌లు తెలుపుతూ పంచాయతీ కార్మికులకు నెల జీతం రూ. 21 వేలు ఇవ్వాలని, టెండర్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలకు పరిరక్షించాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్‌లు అమలు చేయాలని కోరారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్, కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులైన దృష్టిలోపం, వినికిడి లోపం, శారీరక వైకల్యం కలిగిన అభ్యర్థుల కోసం ఉచిత డీఎస్సీ క్రాష్ కోర్సు శిక్షణను విజయవాడలో నిర్వహిస్తోందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి. కామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీటీ టీచర్ పోస్టులకు అర్హత గల అభ్యర్థుల కోసం ఈ శిక్షణను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కనీసం 40 శాతం వైకల్యం ఉన్నవారు మాత్రమే అర్హులని చెప్పారు. ఈ కోర్సుకు దరఖాస్తులు ఈ నెల 11వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రయాణం.. ప్రమాదకరం

- శిథిలావస్థకు చేరుకున్న ఉప్పలూరు వంతెన
- భయపెడుతోన్న వంతెన పరిసరాలు
- మార్జిన్‌లలో ధ్వంసమైన డబ్ల్యూబీం క్రాస్ బారియర్స్
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు



ఉప్పలూరు వద్ద రైవస్ కాలువపై ఉన్న వంతెన

కంకిపాడు: ఉప్పలూరు వంతెన ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. వంతెన మీదుగా ప్రయాణం అంటేనే వాహనదారులు వణికిపోతున్నారు. వంతెన పునాదుల రాళ్లు కదిలిపోతున్నాయి. దీనికి తోడు వంతెనకు ఇరువైపులా ఉన్న మార్జిన్‌లు సైతం ప్రమాదకరంగా మారాయి. ఆదమరిస్తే వాహనం సుమారు 20 అడుగుల లోతుకి పడిపోతుంది. మార్జిన్‌లలో డబ్ల్యూబీం క్రాష్ బారియర్స్ ధ్వంసం కావటమే ఇందుకు ప్రధాన కారణం.

భారీ వాహనాలతో వంతెన ధ్వంసం..

రైవస్ కాలువపై ఉప్పలూరు వద్ద దశాబ్దాల కిందట వంతెన నిర్మాణం జరిగింది. ఈ వంతెన మీదుగా కంకిపాడు-గన్నవరం ప్రధాన రహదారి ఉంది. నిత్యం ఈ రోడ్డు మార్గం వాహనాల రాకపోకలతో బిజీగా ఉంటుంది. ఇటీవల కాలంలో ఎక్కువగా భారీ లోడు వాహనాలు వంతెన మీదుగా ప్రయాణిస్తున్నాయి. ఓ వైపు ఇసుక, మరో వైపు గ్రావెల్స్ లారీలు భారీ లోడుతో అడ్డగోలుగా ప్రయాణిస్తున్నాయి. ఫలితంగా వంతెన పునాది గోడల రాళ్లు కదిలిపోతున్నాయి. పెద్ద పెద్ద పగుళ్లు వచ్చాయి. దీంతో స్థానికులు వంతెన శిథిలావస్థకు చేరుతుందని, భారీ వాహనాలను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. తాత్కాలికంగా నిలుపుదల అయినట్టే అయ్యి మరలా అడ్డగోలుగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో వంతెనకు ముప్పు



ప్రమాదకరంగా ఉన్న వంతెన మార్జిన్

వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మార్జిన్‌లు ఏవీ?

వంతెనకు ఇరువైపులా వాహనదారుల భద్రత నిమిత్తం దశాబ్దం క్రితం డబ్ల్యూబీం క్రాష్ బారియర్స్ నిర్మించారు. కాల క్రమంలో వాహనాలు ఢీకొనటంతో క్రమేపీ అవి కాస్తా ధ్వంసమయ్యాయి. ఎక్కువ భాగం ధ్వంసమైన ప్రాంతాలకు మరో వైపు సుమారుగా 20 అడుగుల లోతైన ప్రదేశం ఉంటుంది. దీంతో ఆదమరిచి వాహనాలు నడిపితే నేరుగా లోతైన ప్రదేశాల్లోకి దూసుకుపోయే ప్రమాదం ఉంది. యుద్ధప్రాతిపదికన వంతెనకు ఇరువైపులా మార్జిన్‌లలో డబ్ల్యూబీం క్రాష్ బారియర్స్ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వాహనదారుల్లో వణుకు..

వంతెనతో పాటుగా మార్జిన్‌లు కూడా ధ్వంసం అవుతుండటంతో ఎప్పుడెలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనన్న భయంతో వాహనదారులు వణికిపోతున్నారు. బిక్కుబిక్కుమంటూ వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఎదురుగా భారీ వాహనాలు వస్తే తప్పుకునే సౌకర్యం కూడా ఇక్కడ లేదు. మార్జిన్ దిగితే ఎక్కడ లోతైన ప్రదేశంలో పడిపోతామో అన్న భయంతో భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రమాదకర వంతెనపై దృష్టి సారించాల్సి ఉంది.

ఘనంగా ఆలయ ప్రతిష్టా మహోత్సవం



నూతనంగా ప్రతిష్టించిన స్వామివార్ల విగ్రహాలు

గన్నవరం: మండలంలోని వెంకటనరసింహాపురం కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీభద్రావతీ సమేత భావనారుషిస్వామి వార్ల ఆలయ ప్రతిష్ట వేడుకలను గురువారం నిర్వహించారు. తొలుత నూతన ఆలయంలో శ్రీభద్రావతీ సమేత భావనారుషి, విఘ్నేశ్వరుడు, సరస్వతిదేవి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. ఈ ప్రతిష్ట మహోత్సవానికి పరిసరా గ్రామాలకు చెందిన భక్తులు హాజరయ్యారు.

ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం



గన్నవరం: స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో గురువారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. తొలుత నోబెల్ అవార్డు గ్రహీత, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు జాన్ హెన్రీడూన్ హంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మానవతా స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన చలివేంద్రం ద్వారా రెడ్‌క్రాస్ ప్రతినిధులు ప్రజలకు మజ్జిగ సరఫరా చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. దేశ, మత, వర్గ విభేదాలు లేకుండా ప్రజలకు సేవా చేయడమే లక్ష్యంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పడిందని గన్నవరం శాఖ వైస్ చైర్మన్ వీవీ కృష్ణమోహన్ తెలిపారు. రెడ్‌క్రాస్ చైర్మన్ చిన్ని మాధవి, ప్రతినిధులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో వినియోగదారులకు నష్టం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

గన్నవరం రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన మాటలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ముస్తాబాద విద్యుత్ ఉపకేంద్రం వద్ద గురువారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. గ్రామంలో స్మార్ట్ మీటర్లు బిగించే కార్యక్రమాన్ని సీపీఎం కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించటం ద్వారా విద్యుత్ వాడకం దారులు ముందుగానే డబ్బు చెల్లించి చార్జింగ్ చేయించుకునే ప్రక్రియకు తెర తీస్తున్నారని ఆరోపించారు. గతంలో ప్రతిపక్షంలో ఉండగా కూటమి నాయకులు స్మార్ట్ మీటర్లను, విద్యుత్ భారాలను వ్యతిరేకించి ఆందోళనలు చేసి, అధికారం వచ్చాక మాట మార్చి ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. సీపీఎం నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, కళ్లం రాంబాబు, బెజవాడ తాతబ్బాయి, ఏసుదాసు, గోపి, సరస్వతి, డాక్టర్ ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి అన్నమయ్య జయంతి ఉత్సవాలు



అన్నమాచార్య జయంతి ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సత్యబాబు శ్రీలలిత, శ్రీ మేధ

విజయవాడ కల్చరల్: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవాలు ఈనెల 11 నుంచి 19 వరకు నిర్వహిస్తామని నిర్వాహకుడు దుగ్గిరాల సత్యబాబు తెలిపారు. గాంధీనగర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లబ్బీపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 11న సాయంత్రం శ్రీ లక్ష్మీనరసింహ, తరిగొండ వెంగమాంబ జయంతితో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 12న ఉదయం నుంచి అన్నమాచార్య జయంతి ఉత్సవాల సందర్భంగా సంకీర్తనా మహోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. 13వ తేదీ నుంచి ప్రతి రోజూ సాయంత్ర దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు అన్నయ్య సంకీర్తనలను గానం చేస్తారని, 19న సాయంత్రం సప్తగిరుల సంకీర్తనతో కార్యక్రమాలు ముగుస్తాయని వివరించారు. సమావేశంలో సంకీర్తన అకాడమీ సభ్యులు పి. ప్రసాద్, హస శ్రీమేధ శ్రీలలిత పాల్గొన్నారు. బ్రోచర్‌ను సభ్యులు ఆవిష్కరించారు.

స్కూళ్లల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కంకిపాడు: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 2025-26 విద్యాసంవత్సరానికి గానూ ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ కె.ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆర్‌టీఈ 12(1)సీ ప్రకారం 25 శాతం సీట్లు పేద, మధ్యతరగతి వర్గాలకు కేటాయించాల్సి ఉందన్నారు. అర్హులు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను ఈనెల 19వ తేదీ లోపు అందించాలని సూచించారు.

చెస్ శిక్షణ శిబిరం ప్రారంభం



విజయవాడ స్పోర్ట్స్: గ్లోబల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో చదరంగం వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని మొగల్రాజపురంలోని అకాడమీలో గురువారం ప్రారంభించారు. శ్రీ మానస నర్సింగ్ హోం వైద్యులు డాక్టర్ మానసకాజా, చార్టెడ్ అకౌంటెంట్ కంచర్ల చంద్రరావు పూర్ణ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. జూన్ ఎనిమిదో తేదీ వరకు శిబిరం కొనసాగుతుందని, ఆసక్తి ఉన్న వారు 98495 14138 నంబర్‌ను సంప్రదించాలని అకాడమీ కార్యదర్శి షేక్ ఖాసీం కోరారు.

అకాల వర్షంతో రైతులకు అవస్థలు



తోట్లవల్లూరులో ఆరబెట్టిన మొక్కజొన్న

తోట్లవల్లూరు: అకాల వర్షంతో రైతులు అవస్థలు పడుతున్నారు. వాతావరణం ఎప్పుడు మారుతుందో, ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరుతోపాటు పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, ధాన్యం, పసుపును కాపాడుకొనేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. ఆయా పంటలను పరదాలు కప్పి కాపాడుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అకాల వర్షాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి కల్యాణోత్సవాలు

పెనమలూరు: పోరంకిలో వేంచేసి ఉన్న శ్రీవసంత వేణుగోపాల స్వామి, శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంలో ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ 10వ తేదీ ఉదయం 8 గంటలకు స్వామివార్లను పెళ్లి కుమారుడిని చేస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు ఆలయంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. 11వ తేదీ ఉదయం 8 గంటలకు నిత్యహోమం, 9 గంటలకు శ్రీకృష్ణ మండలిచే పారాయణం, సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, రాత్రి 7.30 గంటలకు శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీ శ్రీవసంతవేణుగోపాలస్వామివారికి దివ్య తిరు కల్యాణం మహోత్సవం జరిపిస్తామన్నారు. 12వ తేదీ ఉదయం 7 గంటలకు నిత్యహోమం, గరుడవాహనంపై గ్రామోత్సవం, చక్రస్నానం, రాత్రి 7.30 గంటలకు ధ్వజ అవరోహణ, స్వామివారి పవళింపుసేవ, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామని వివరించారు.

కలెక్టర్‌కు రెవెన్యూ ఉద్యోగుల సత్కారం

చిలకలపూడి(మచిలీపట్నం): రెడ్‌క్రాస్ ద్వారా విశిష్ట సేవలు అందించినందుకు కలెక్టర్ డీకే బాలాజీకి గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్న నేపథ్యంలో కలెక్టరేట్ రెవెన్యూ ఉద్యోగులు ఆయనను గురువారం రాత్రి ఘనంగా సత్కరించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జరిగిన సత్కారంలో ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డీఆర్వో కె. చంద్రశేఖరరావు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవో కె స్వాతి, డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, కలెక్టరేట్ ఏవో సీహెచ్ వీరాంజనేయప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

నేలకూలిన శ్రీమహాలక్ష్మి మాను



పెనమలూరు: పోరంకిలో శ్రీ మహాలక్ష్మి మానుగా ప్రసిద్ధి గాంచిన వృక్షం గురువారం నేలకూలింది. గ్రామంలో శ్రీ వసంతవేణుగోపాలస్వామివారి ఆలయం వద్ద శ్రీ మహాలక్ష్మి మాను చాలా ఏళ్లుగా ఉంది. వేపచెట్టు, రావిచెట్టు కలిపి మానుగా ఉంది. గ్రామంలో భక్తులు ఏ శుభకార్యం జరిగిన మేళ తాళాలతో ఊరేగింపుగా వచ్చి శ్రీమహాలక్ష్మి మానుకు ప్రత్యేక పూజలు చేస్తారు. అయితే గురువారం మధ్యాహ్నం ఈదురు గాలులు రావటంతో ఇది ఒక్కసారిగా విరిగి నేల కూలింది. ఆ సమయంలో అక్కడ ఉన్న కారుపైన, దగ్గరలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫారం పై పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

గన్నవరం: ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకురాలు పోస్టుల భర్తీకి రోస్టర్ ప్రకారం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పి. వెంకటలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అల్లాపురం-2 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు ఓసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు సంబంధించి బీబీ గూడెం-1(బీసీ-ఏ), కొత్తపేట(బీసీ-డీ), అల్లాపురం-1 (ఎస్సీ), అల్లాపురం-2(ఓసీ), బుద్దవరం-3(బీసీ-డీ), దుర్గాపురం(ఓసీ), బూతిమిల్లిపాడు(ఎస్సీ), పొట్టిపాడు-2(బీసీ-డీ), కాకులపాడు-1(ఓసీ), కాకులపాడు-2(ఎస్సీ), మల్లవల్లి-2(బీసీ-ఏ) నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 2024 జూలై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగిన పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానికులైన వివాహితురాలు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 17వ తేదీలోపు విద్యా, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతచేసిన దరఖాస్తులను స్వయంగా గన్నవరంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సమర్పించాలని సీడీపీఓ తెలిపారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టు..

కంకిపాడు: ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు సీడీపీఓ కేబీ సుకన్య తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. కంకిపాడు మండలం ఉప్పలూరు-3 (బీసీ-ఏ)కు రిజర్వు అయ్యిందన్నారు. పెనమలూరు మండలంలోని కానూరు-17 (ఓసీ), కానూరు-6 (బీసీ-ఈ), పోరంకి-7 (ఓసీ), తాడిగడప-2 (ఎస్‌సీ), తాడిగడప-5 (ఓసీ), యనమలకుదురు-11 (ఓసీ), యనమలకుదురు-13 (బీసీ-ఈ)కి రిజర్వు అయ్యాయన్నారు. ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలోని 19, 20 వార్డుల కేంద్రం (ఓసీ), హరిజనవాడ-3 (ఎస్‌సీ), లంబాడీపేట-1 (ఎస్‌టీ)కి రిజర్వు అయ్యాయన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు తాము పూర్తి చేసిన దరఖాస్తులను, ధ్రువీకరణ పత్రాలను ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కంకిపాడు ప్రాజెక్టు కార్యాలయంలో నేరుగా అందించాలని సూచించారు.

ఆసక్తి గల రంగాల్లో ప్రతిభ చాటాలి



తెన్నేరు గ్రంథాలయంలో చిత్రలేఖనంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



వణుకూరులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



పురుషోత్తపట్నంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కంకిపాడు: ఆసక్తి కలిగిన రంగాల్లో విద్యార్థులు ప్రతిభ చాటాలని వక్తలు సూచించారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా గురువారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంలో పోటీలు ఏర్పాటు చేశారు. చెస్, క్యారమ్స్‌లో శిక్షణ ఇచ్చారు. పలు ఆటల పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ, ఎస్.అప్పారావు, టి.సురేష్ బాబు పర్యవేక్షించారు. తెన్నేరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చి పోటీలు నిర్వహించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. శిక్షణ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

వణుకూరులో విద్యార్థుల పుస్తక పఠనం..

పెనమలూరు: వణుకూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో గురువారం విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. గ్రంథాలయ అధికారి భారతి వివరాలు తెలుపుతూ విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, వారికి చదువు పట్ల ఆసక్తి కలిగించామన్నారు. అలాగే తోక కథలతో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారని అన్నారు. వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించగా మొత్తం 33 మంది విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు.

విద్యార్థుల సృజనకు పదును..

గన్నవరం రూరల్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు సమ్మర్ క్యాంపులు దోహదం చేస్తాయని పురుషోత్తపట్నం శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం పేర్కొన్నారు. గురువారం సమ్మర్ క్యాంపులో భాగంగా రిసోర్స్ పర్సన్ కొల్లి మేఘనాథ్ విద్యార్థులకు డ్రాయింగ్‌లో మెళకువలు నేర్పించారు. ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనం చిన్ననాటి నుంచి విద్యార్థులు అభ్యసన చేయాలన్నారు. అనంతరం కథల పుస్తకాలు చదివించటం, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. మండలంలోని ముస్తాబాదలో గ్రంథాలయ అధికారి కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో జరిగిన సమ్మర్ క్యాంపులు విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

జ్ఞాన మార్పిడితో కొత్త ఆవిష్కరణలకు ఆస్కారం



కానూరులో అంతర్జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న ప్రతినిధులు

పెనమలూరు: అంతర్జాతీయ సదస్సులతోనే జ్ఞాన మార్పిడి జరుగుతుందని పోలాండ్ దేశానికి చెందిన జాన్‌డుగోజ్ యూనివర్సిటీ భౌతిక శాస్త్రం ప్రొఫెసర్ మిచల్‌పియాసెకి అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం కాలేజీ మెకానికల్ విభాగం, ఎన్ఐటీ వరంగల్ ఆధ్వర్యంలో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ మెకానికల్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్-2025 అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మార్పిడి జరిగినప్పుడే కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని అన్నారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి 100 పరిశోధనా పత్రాలు అందగా.. అందులో 60 పరిశోధనా పత్రాలు ఎంపిక చేశారు. వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ జి.రాఘవేంద్ర, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ బి.రఘుకుమార్, డాక్టర్ నిరంజన్, కోఆర్డినేటర్ డాక్టర్ పి.ఫణిప్రశాంతి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

'మానవత'కు విశ్రాంత ఉపాధ్యాయురాలు విరాళం



మానవత సభ్యులకు చెక్కును అందిస్తున్న ఉపాధ్యాయుడు రమణగోపాల్

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు విశ్రాంత ఉపాధ్యాయురాలు ఆబోతుల పార్వతి రూ. 50వేలు విరాళాన్ని అందించారు. ఇటీవలే బాపులపాడు మండలం వీరవల్లి జెడ్పీ హైస్కూల్‌లో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ విరమణ చేసిన ఆమె మానవత నిర్వహిస్తున్న సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగస్వామి కావాలనే తలంపుతో తన వంతుగా తోడ్పాటును అందించేందుకు ముందుకు వచ్చారు. స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పార్వతి రూ.50 వేలు విరాళాన్ని ఆ పాఠశాల ఉపాధ్యాయుడు మానికొండ రమణగోపాల్ ద్వారా సంస్థ సభ్యులకు అందించారు. ఆమె దాతృత్వాన్ని మానవత సభ్యులు అభినందిస్తూ జ్ఞాపిక, శాలువా బహూకరించారు. మానవత కేంద్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాడి చెట్టుపై పడిన పిడుగు



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలో గురువారం మధ్యాహ్నం పిడుగులతో కూడిన వర్షం కురిసింది. కూచిపూడిలో డాక్టర్ గొట్టిపాటి రామకృష్ణారావు(పెదపూడి) హాస్పిటల్ ఎదురుగా గల తాడిచెట్టుపై పిడుగు పడి అగ్నికి ఆహుతైంది. చెట్టు విరిగి విద్యుత్ లైన్లపై పడటంతో భట్ల పెనుమర్రు, పెదసనగంటి పాలెం, చినముత్తేవి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.